# 8

ఫైలు చూసే ఎం.డి మోములో చిరునవ్వు విరిసింది. ఆ చిరునవ్వు కార్తీక పున్నమినాటి వెన్నెలలా మెల్లమెల్లగా కేబిన్ అంతా వ్యాపించింది.

ప్రసాదుకు చాలా సంతోషం కలిగింది. ఎం.డి. అలా చిరునవ్వు చిందించారంటే తాను వ్రాసిన దానితో ఎం.డి. పూర్తిగా ఏకీభవిస్తున్నారనే, అర్థమని కంపెని జి.యం.గా పనిచేసే ప్రసాదుకి తెలుసు.

"రావు గట్టివాడే..."ఎం.డి. అన్నారు "ఇంటర్వ్యూలో అతని మాటలు విని కొంత ఆత్మప్రశంసన చేసుకుంటున్నాడని, అనుకున్నానుకాని.." ఏం.డి. ఒక నిమిషం ఆగారు. ఆ తరువాత ఒక గుటక మంచి నీళ్లు పుచ్చుకొని అన్నారు. "తన జీతం, తన సిబ్బంది జీతం, విద్యుత్ వాడకములోను, తన విభాగానికి కొనే వస్తువులలోను పొదుపు చేసి సంపాదించ వచ్చునని, ఇంటర్వ్యూలో చెప్పినప్పుడు కోతలు కొస్తున్నాడనే అనుకున్నాను. నిజం చేస్తాడని అనుకోలేదు సుమా".

నిజమే! రావు ఎలక్ట్రికల్ శాఖాధిపతిగా చేరిన తరువాత విద్యుత్ వినియోగాన్ని బాగా తగ్గించగలిగాడు. అందువల్ల విద్యుత్ బిల్లుకూడ బాగా తగ్గింది. ప్రసాద్ పని చేసే ఇటువంటి చిన్న తరహా పరిశ్రమలో నెలకు ఒకటి రెండు లక్షల ఖర్చు తగ్గినా, గణనీయమే!

"రావుని కాదయ్యా, నిన్ను.. నిన్ను అభినందించాలి..." ఫైలులో ఏదో వ్రాస్తూ ఎం.డి. అన్నారు. "రావుని తెచ్చింది నీవే గా..."

నిజమే! రావుని ఎం.డి.కి. పరిచయం చేసినది ప్రసాదే. రావుకి

ఉద్యోగం ఇవ్వమని ఎం.డి. ని ప్రాధేయబడినది కూడా ప్రసాద్!

రావు ప్రసాద్‌కి చిన్ననాటి స్నేహితుడు ఎలక్ట్రికల్ ఇంజనీర్ అక్కడ, ఇక్కడ భారీ పరిశ్రమలలో పనిచేసాడు. నిలబడి నీళ్లు తాగటం కన్నా పరిగెత్తి పాలు తాగటమే మేలు అని నమ్మిన వ్యక్తి, అతను! ఏ పరిశ్రమలోనైనా, ఒకటి రెండు సంవత్సరాల కన్నా పని చెయ్యడు. ఒకే కంపెనీలో ఎందుకు పనిచేయ్యడం లేదని ప్రసాద్ అప్పుడప్పుడు. అడిగేవాడు. పరిశ్రమల యాజమాన్యాలు మేడిపళ్లని. పనిచేయటానికి ఎక్కడా స్వతంత్ర్యముండదని చెప్పేవాడు అతడు. తను పనిచేసే సంస్థకూడా అలాగే వుంటుందని చెప్పాడు ప్రసాద్.

"ఐనా పర్వాలేదురా, చూస్తాను. ఎలోగో ఇప్పుడు ఖాళీయేగా" ఎం.డి.ని ఒప్పించటం చాలా కష్టమైంది ప్రసాద్‌కి. నిలకడగా పనిచేసే వాళ్లంటేనే ఎం.డి.కి ఇష్టం.

ఉద్యోగములో చేరిన రోజునుంచి రావు దీక్షగా పనిచెయ్యటం ప్రారంభించాడు. విద్యుత్ వినియోగం గురించే ఆలోచించేవాడు. ఒక నెల రోజులలోనే విద్యుత్ వినయోగం కొంత తగ్గించాడు. దినదిన ప్రవృద్ధమయ్యే శుక్లపక్షపు చంద్రుడు, తన వెన్నెలవేళని పొడిగిస్తున్నట్టు విద్యుత్ వినియోగములోను, కొనుగోలులోను పొదుపు పెరుగుతూ వచ్చింది. విద్యుత్ పొదుపు చెయ్యటం గురించి రావు తెచ్చిన సూచనలపై గుడ్డిగా అమోద ముద్ర వేసేవాడు ప్రసాద్. ఫ్యాక్టరీలో పనిచేసే ఇతర విభాగాలవారు విద్యుత్ పొదుపు గురించి రావు తీసుకునే చర్యల వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయన్నా పట్టించుకునేవాడు కాదు ప్రసాద్. కాగితంపై కనబడిన ఆదా చేసిన సొమ్ము దానికి ఒక కారణమైతే, పని చెయ్యటానికి స్వతంత్ర్యం కావాలనే రావుమాట మరో కారణం. ఉద్యోగులు గురువిందగింజంత మార్పుని

కూడా వ్యతిరేకిస్తారనేది ప్రసాద్ నమ్మకం!

"ఐతే, రావుకి ప్రమోషన్ ఇవ్వాలంటావు.. అంతేనా.." ఎం.డి. అడిగారు.

"అంతేనాయంటే... అతను చూపిన పోదుపు... కంపెనీకి లాభం.." ప్రసాద్ గొణిగాడు.

"అర్థమైందిలే.." ఎం.డి. పెన్ను అందుకున్నారు.

హఠాత్తుగా కరెంటు పోయింది. అత్యవసర విద్యుత్ దీపాలు వెలిగాయి.

" రేపు చూద్దాం" ఎం.డి. అన్నారు. "పెన్ను పట్టుకోగానే కరెంటు పోయింది." కేబిన్ నుంచి బయటకు వచ్చారు వాళ్ళు. మెట్లు దిగి తలుపు దగ్గరకు చేరుకున్నారు.

జోరుగా కురుస్తోంది వాన! అంతా చీకటి! ఊరంతా కరెంటు పోయినట్టుంది.

ప్రసాద్ సెల్‌ఫోన్ మ్రోగింది. ఫోను ఫ్యాక్టరినుంచే!

ఫోను మాటలాడుతూ ఉంటే ప్రసాద్‌కి కళ్ళు తిరిగినట్లైంది. చెయ్యిజారి సెల్ క్రింద పడిపోయింది.

"ఏమైంది" ఎం.డి. అడిగారు.

"ఫ్యాక్టరీలో కూడా మొత్తం కరెంటు పోయిందట, మెల్లిగా గొణిగాడు ప్రసాద్.

"అయితే ఏమిటి. ఎమర్జెన్సీ కరెంటు వుందిగా" ప్రసాద్ ఏమీ అనలేదు. కంగారుతో అతని శరీరం వణకింది.

"చెప్పండి, ఏమైంది..."

"ఎమర్జెన్సీ కరెంటు స్టార్ట్ అవ్వలేదట"

"ఆ..."

"ఆ యంత్రములో పార్ట్ ఒకటి పోతే మొన్ననే మార్చాంకదా... అది పనిచెయ్యలేదట"

"ఏమిటి"

"కర్చు తగ్గించటానికని చౌకరకం కొన్నాడట రావు"! ప్రసాద్ మాటలు తడబడ్డాయి" అది పనిచెయ్యలేదట".

గట్టిగా ఉరిమింది ఆకాశం. ఆ వెలుగులో ఏం.డి.బుసకొట్టే నాగుపాములా కనబడ్డాడు ప్రసాదుకి.

"అంతేనా ..." ఎం.డి. అడిగాడు.

"అంతేనాయంటే... ఫ్యాక్టరీ పొలిమేరలో వున్న పంపు వద్దకు వెళ్లాడట అపరేటర్. అక్కడ లైటు తీసేసారట. బ్యాటరీలు కూడా లేవట".

"ఏమిటి" గర్జించాడు ఎం.డి.

"బాటరీల ఖర్చు ఎక్కువ అవుతుందని టార్చ్‌లతో పెద్ద అవసరం వుండదు కదా అని బాటరీలు కొనటం తగ్గించేసాము సార్.." ప్రసాద్ ఒక నిమిషం ఆగాడు. ఆ తరువాత అసలు విషయ కక్కాడు. "ఘోరం జరిగిపోయిందిసార్. పంపు వద్దకు వెళ్లిన ఆపరేటర్ని నాగుపాము కాటేసింది సార్".

నేలకు ఒరిగిపోయాడు, ప్రసాద్. రావు చేసే పొదుపు తాలుకు నిజరూప దర్శనం చేసిన అతను స్పృహ  కోల్పోయాడు.

లోగుట్టు పెరుమాళ్లకెరుక!